క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో ఆదివారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నట్లు మోదకొండమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ దేవత మోదకొండమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్ల యజమానులకు వరుసగా రూ.15, రూ.10, రూ.8, రూ.5 వేల చొప్పున అందిస్తామన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

వనదేవీశ్వర స్వామి కల్యాణోత్సవం నేడు

దేవరాపల్లి: స్థానిక వనదేవీశ్వర ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు, గౌరి దంపతులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. సోమవారం మహిళల కోలాటం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తామన్నారు.

ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో శనివారం ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆర్థిక సహకారంతో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రూ.32,500తో వీటిని అమర్చారు. సర్పంచ్ జామి రమణబాబు, గ్రామస్తులు ఆడారి సన్యాసినాయుడు, ఆడారి కన్నారావు, రాపేట గోవింద, తదితర్లు పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధి బాధితుడికి డిప్యూటీ సీఎం పరామర్శ

చీడికాడ: కిడ్నీ సంబంధిత వ్యాధితో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దండిసురవరం పాఠశాల కమిటీ చైర్మన్ బూసాల రామకృష్ణను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం పరామర్శించారు. రామకృష్ణ ఆరోగ్య స్థితిపై వైద్యులతో మాట్లాడారు. అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దండిసురవరం పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కె.కోటపాడు: పిండ్రంగి గ్రామానికి చెందిన బత్తి కనకం(49) గతేడాది సెప్టెంబర్ 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతడి భార్య చిన్నమ్ములు ఫిర్యాదు చేసినట్టు ఏ కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ శనివారం తెలిపారు. అతడి ఆచూకీ కోసం ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఇతర గ్రామాల్లో వెతికారన్నారు. చివరికి ఫలితం లేక పోవడంతో ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికరం



క్లాత్ సంచులను అందిస్తున్న కన్సర్న్ చారిటబుల్ చైర్మన్ జోష్

కె.కోటపాడు: ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని ప్రజలంతా గుర్తించాలని కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.కె.జోష్ తెలిపారు. కె.కోటపాడులోని ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ప్రజలకు క్లాత్ సంచులను ఆయన పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి క్రమేణా దూరమై పర్యావరణ, భూమి సంరక్షణకు ప్రజలంతా సామాజిక బాధ్యతతో నడుం బిగించాలని జోష్ కోరారు.

ఘనంగా గంగమ్మ తల్లి పండగ



పూజలు చేస్తున్న ఎంపీపీ, తదితరులు

రోలుగుంట: కంచుగుమల కూడలిలో గంగమ్మ తల్లి పండగను జాలర్ల కుటుంబాలు, గ్రామస్తులు శనివారం వేడుకగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ వడ్డాది సతీష్, సర్పంచ్ బండారు శ్రీను అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను పట్టభద్రులంతా మంచి ఆలోచన చేసి గెలిపించాలని ఇక్కడకు వచ్చిన ఓటర్లను కోరారు.

కొండలెక్కిన అధికారులు

- గిరిజన గ్రామాల్లో గర్భిణుల సమస్యలపై ఆరా
- ప్రసవానికి ముందుగానే ఆస్పత్రులకు తరలిస్తామని భరోసా
- డోలీ మోతల కష్టాలకు చెక్



నాతవరం: కొత్త దద్దుగులో గర్భిణితో మాట్లాడుతున్న అధికారులు



రోలుగుంట: లోసింగులో గిరిజన కుటుంబాలతో సమావేశమైన తహసీల్దార్ వెంకటేశ్వరరావు



రావికమతం: కొండలెక్కుతున్న తహసీల్దార్, ఇతర అధికారులు

రావికమతం: కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మహేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రావికమతం పీహెచ్‌సీ సిబ్బంది శనివారం కొండలెక్కి జీలుగులోవ గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన గర్భిణి కొర్ర సంధ్యకు సరైన వైద్యం అందడం లేదని ఇటీవల కలెక్టర్‌కు గిరిజన సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. రహదారి సౌకర్యం లేని అటువంటి గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించాలని ఆయన ఆదేశించారు. ఆ మేరకు అధికారుల బృందం పర్యటించింది. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి మందులు పంపిణీ చేశారు. గర్భిణి సంధ్యకు వైద్య సిబ్బంది పరీక్షించారు. ఆమె తన పుట్టినిల్లు ఎదురువలస గ్రామానికి వెళ్లి వైద్య సహాయం పొందుతానని చెప్పడంతో తగిన ఏర్పాట్లు చేశారు. గిరిజన సంఘం నాయకుడు కె.గోవిందరావు పాల్గొన్నారు.

నాతవరం: కలెక్టరు, నర్సీపట్నం ఆర్డీవో ఆదేశాలతో సుందరకోట పంచాయతీ శివారు కొండలపై కొత్త దద్దుగుల గ్రామంలో ఇద్దరు గర్భిణుల ఇళ్లకు శనివారం అధికారులు వెళ్లారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి ప్రభుత్వ ఆస్పత్రిలో పైసా ఖర్చు కాకుండా ప్రసవమయ్యేంత వరకు వైద్యంతోపాటు పౌష్టికాహారం అందిస్తామన్నారు. రవాణా చార్జీలు, ప్రసవమయ్యాక రూ. 5 వేలు ఇస్తామన్నారు. దీనికి గర్భిణులు అంగీకారం తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, సరుగుడు వీఆర్వో బొత్సా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృపారావు పాల్గొన్నారు.

గిరిజన గర్భిణులకు పూర్తిస్థాయిలో సేవలు

రోలుగుంట: గిరిజన గర్భిణులకు పూర్తిస్థాయిలో సేవలందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఇటీవల అర్ల గిరిజన పంచాయతీ శివారు లోసింగి, పెదగరువు, పీత్రిగెడ్డ తదితర గ్రామాల్లో గర్భిణులు వైద్య సేవలకు పడుతున్న ఇబ్బందులపై కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.అపరంజని, బుచ్చింపేట పీహెచ్‌సీ సిబ్బంది శనివారం గిరిజన గ్రామాలను సందర్శించారు. పెదగరువు, పాత, కొత్త లోసింగి, పీత్రిగెడ్డ గ్రామాలకు చెందిన గర్భిణులు, వారి కుటుంబాలతో లోసింగిలో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రసవ సమయంలో మైదాన ప్రాంతానికి తరలించి వైద్య సహాయ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అందిస్తామని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. దీనికి వారు ససేమిరా అనడంతో సర్దిచెప్పారు. హెల్త్ అసిస్టెంట్ హరిబాబు పాల్గొన్నారు.

ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి



మాడుగుల: గాదిరాయిలో జగనన్న కాలనీలు పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి



నాతవరం: వల్సంపేటలో ఇళ్ల పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రోజారాణి, ఎంపీడీవో

నాతవరం: మండలంలో 423 ఇళ్ల మంజూరు కోసం కలెక్టరుకు ప్రతిపాదనలు పంపించామని మండల ప్రత్యేకాధికారి ఎం. రోజారాణి తెలిపారు. వల్సంపేట, నాతవరం పంచాయతీలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఉగాదిలోగా 354 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇల్లు కట్టుకునే వారికి వేసవిలో నీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, హౌసింగ్ జేఈ జోగారావు, ఉపాధి ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

266 మంది గృహ ప్రవేశాలకు చర్యలు

కె.కోటపాడు: ఉగాదిలోగా 266 మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకునేలా అధికారులు చర్యలను తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. శనివారం మేడిచర్లలో అధికారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఇప్పటికే మండలంలో 160 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరో 106 ఇళ్లు ఉగాదికి పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ఎంపీడీవో శచీదేవి, హౌసింగ్ ఏఈ రవిబాబు, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చంద్రశేఖర్, శ్వేత, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

మాడుగుల: జగన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. శనివారం ఆమె గాదిరాయి, ఎం. కృష్ణాపురం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో 40 ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల ప్రగతిని బట్టి బిల్లులు మంజూరు చేస్తామన్నారు. గృహ నిర్మాణశాఖ ఏఈ ఎల్. సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ నాగేశ్వరరావు, సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్రే రాము నాయుడు, సలాది అచ్చంనాయుడు పాల్గొన్నారు.

బీఎల్వోలపై ఆర్డీవో ఆగ్రహం

మాకవరపాలెం: మండలంలో 60 శాతం ఓటరు కార్డులకు మాత్రమే ఆధార్ అనుసంధానమై నియోజకవర్గంలో వెనుకబడి ఉండటంతో నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన అన్ని గ్రామాల బూత్ లెవెల్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు డివిజన్‌లో 21 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ ప్రసాదరావు, డీటీలు శంకర్రావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం

చోడవరం: ఓటరు కార్డుకు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానం చేయాలని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ ఆదేశించారు. చోడవరం మండలంలో వీఆర్వోలు, బీఎల్వోలతో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రికార్డులను పరిశీలించారు. నియోజకవర్గంలో రావికమతం మండలంలో 55 శాతం, బుచ్చెయ్యపేటలో 51, రోలుగుంట మండలంలో 41 శాతం కాగా, చోడవరం మండలంలో 35 శాతం మాత్రమే అనుసంధానం చేశారన్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. చనిపోయిన, దూరప్రాంతాల్లో స్థిరపడిన, వివాహమై వెళ్లిపోయిన ఓటర్లను గుర్తించి, ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉంటే వాటిని తొలగించాలన్నారు. తహసీల్దార్ తిరుమలబాబు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు గాలికుంటు నివారణ టీకాలు

మాకవరపాలెం: పశువులకు వేస్తున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని పశుసంవర్ధకశాఖ ఏడీ సింహాద్రప్పడు తెలిపారు. మండలంలోని రామన్నపాలెం, మాకవరపాలెం గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. రైతులంతా తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. ఈ విషయంలో రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. పశువైద్యులు రామ్మోహనరావు, ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ పాదాలు తీర్థం

మాడుగుల: స్థానిక ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.

సీబీఎస్ఈ సిలబస్ అమలు

నర్సీపట్నం: వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమలవుతుందని హెచ్ఎం ఎస్.మోహన్‌రావు తెలిపారు. వేములపూడి పీఎం జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలకు సీబీఎస్ఈ సర్టిఫికెట్ వచ్చిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కమిటీ చైర్మన్ ఎ.వరహాలబాబు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



వైస్ ఎంపీపీకి పుస్తకాలందిస్తున్న పూర్వ వీసీ ముత్యాలనాయుడు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో ఆధ్యాత్మిక గ్రంథాలయానికి పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు శనివారం భగవద్గీత, రామాయణం, నీతి సూత్రాలు, వేమన, దాశరధీ శతకాల పుస్తకాలను అందజేశారు. జనరల్ నాలెడ్జీ పుస్తకాలను వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణతో కలిసి అందించారు. టీటీడీ ధర్మ ప్రచారక్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 129 మంది ఎంపిక

నర్సీపట్నం: అరబిందో, హెట్రో కంపెనీలు సంయుక్తంగా స్థానిక శ్రీవిద్య కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించాయి. 500 మంది వరకు నిరుద్యోగులు హాజరు కాగా, 129 మందిని ఎంపిక చేశాయి. వీరికి అనకాపల్లి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ ఇచ్చి, అనంతరం ఉద్యోగాలు కల్పిస్తామని ఆయా కంపెనీల ప్రతినిధులు జి. జగదీశ్వరరావు, భరత్ పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ జి.సత్యవతి, డైరెక్టర్ బోళెం దొరబాబు పాల్గొన్నారు.



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు విస్తృత ప్రచారం



గొలుగొండ: చీడిగుమ్మలలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ గిరిబాబు



నర్సీపట్నం: ఓటరును అభ్యర్థిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం/దేవరాపల్లి/బుచ్చెయ్యపేట/ గొలుగొండ/మాడుగుల/రూరల్/మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ నాయకులు శనివారం విస్తృత ప్రచారం చేశారు. ఈ మేరకు దేవరాపల్లి మండలం ఏ. కొత్తపల్లి, కె.ఎం.పాలెం, ముషిడిపల్లి, కాశీపురం, దేవరాపల్లి గ్రామాల్లో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు ఇంటింటికి తిరిగి పట్టభద్రులను అభ్యర్థించారు.

నర్సీపట్నంలో.. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు.

బుచ్చెయ్యపేటలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ నాయకులతో కలిసి వడ్డాది, కేపీ అగ్రహారం, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

మాడుగుల/రూరల్‌లో.. వీరనారాయణం, ఎం.కోడూరు, తదితర గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ ప్రచారం చేశారు.

మాకవరపాలెంలో.. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులను ఎంపీపీ రుత్తల సత్యనారాయణ కలిశారు. సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొలుగొండలో.. జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, చీడిగుమ్మలలో ఆయన, జోగుంపేటలో వైస్ ఎంపీపీ జక్కు నాగమణి ప్రచారం నిర్వహించారు.

సీఎంతో మర్యాద పూర్వక కలయిక





గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం విశాఖలో బస చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, రాష్ట్ర సృజనాత్మకత అండ్ సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్ జోగినాయుడు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. - నర్సీపట్నం

ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలతో రోగాలు

జిల్లా మలేరియా నివారణ అధికారి వరహాలదొర



వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వరహాలదొర

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో ప్రజలు మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలను పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి వరహాలదొర తెలిపారు. శనివారం ఎ.కోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. 0-5 ఏళ్లలోపు చిన్నారులకు వేసిన పెంటావాలెంట్, టి.డి, రోటా, ఐపీవీ వ్యాక్సిన్‌లను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు మురుగు నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా సోకుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఏఎంవో రమణ, సూపర్ వైజర్ సురేష్, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ప్రమీల, నాగేంద్ర పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

సీనియర్ సివిల్ జడ్జి లీలావతి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

నర్సీపట్నం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులనుద్దేశించి ఆమె మాట్లాడారు. బాలికల సంక్షరణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. బాలికలను ర్యాగింగ్ చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. చైల్డ్ మ్యారేజ్ చట్టరీత్యా నేరమన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు చట్టాలు గురించి వివరించారు. న్యాయవాది పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి అంబేడ్కర్



విగ్రహావిష్కరణలో ఎస్ఐ, సర్పంచ్, తదితరులు

మాకవరపాలెం: దేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. స్థానిక దళితవాడలో స్థానికులు మార్తి శేఖర్, సాంబ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్ఐ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అల్లంపల్లి శిరీష మాట్లాడుతూ యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ మేనేజర్ అల్లంపల్లి వెంకటరమణ, అంబేడ్కర్ యువసేన అధ్యక్షుడు లచ్చారావు, వార్డు సభ్యులు సూర్యలక్ష్మి, రమేష్, సింహాచలం, మరిడియ్య, శివ పాల్గొన్నారు.

వేతనదారులందరికీ పనులు కల్పించండి



తామరబ్బ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

దేవరాపల్లి: జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి సిబ్బందికి సూచించారు. తామరబ్బలో ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈమె వెంట ఉపాధి ఏపీవో డి. చంద్రకళ, పంచాయతీ సెక్రటరీ ఎల్. లింగన్న ఉన్నారు.

ఎనిమిది లక్షల పనిదినాలు కల్పించాలి

నాతవరం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో అదనపు ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.25 కోట్లతో బడ్జెట్ రూపొందించామన్నారు. మండలంలో 13 వేలకుపైగా జాబ్‌కార్డుదారులకు ఈ ఏడాది 8 లక్షల పని దినాలు కల్పించాలన్నారు. ఎంపీడీవో యాదిగిరీశ్వరరావు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చోడవరం రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు చేసుకోవాలని చోడవరం గురుకులం ప్రిన్సిపాల్ రత్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23-2024 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. 74 శాతం బీసీ విద్యార్థులకు, 15 శాతం ఎస్సీలకు, 6 శాతం అనాథలకు, 3 శాతం ఈబీసీ, ఇతర కులాలకు రెండు శాతం సీట్లు రిజర్వు చేశారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతూ 2012 సెప్టెంబర్ ఒకటి నుంచి 2014 ఆగస్టు 31వ తేదీలోపు జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 9 నుంచి 13 ఏళ్ల లోపు వయస్సు వారైనా మినహాయింపు ఉందన్నారు. వార్షికాదాయం లక్ష రూపాయల లోపు ఉండాలని, వంద రూపాయల ఫీజు చెల్లించాలన్నారు. తెలుగు, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టులలో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు గంటల సమయంలో ప్రవేశ పరీక్ష రాయాలన్నారు.